కథ

ఢిల్లీలో కొడుకూ కోడలి దగ్గర పది రోజులుండి తిరిగి వస్తున్నాం నేనూ మా ఆవిడా. చప్పుడు చేస్తూ ట్రెయిన్ గంగానదిని దాటుతూండగా నిద్రలోంచి మేల్కొన్నాను అర్ధరాత్రి వేళ. గంగానదిని చూస్తూంటే సుమారు ముప్ఫయి సంవత్సరాల నాటి సంఘటన గుర్తుకొచ్చింది.

★ ★ ★

కాశీ మణికర్ణికా ఘాట్‌లో నాన్నగారి అంత్యక్రియలు జరిపి అస్థికలు విడిచి పెడుతూంటే కళ్లంట నీళ్లు తిరిగాయ్. చాలీ చాలని జీతంతో ఇద్దరు అక్కలకీ పెద్ద సంబంధాలు వెతికి పెళ్లిళ్లు చేయడమే కాకుండా నన్ను పెద్ద చదువులు చదివించి, నాకో మంచి ఉద్యోగం, సంఘంలో ఒక గౌరవప్రదమైన స్థానమూ కల్పించారు నాన్నగారు. తను ఎన్నో కష్టాలు పడి నాకో ఉజ్వల భవిష్యత్తు ప్రసాదించారు. సజల నయనాలతో అంజలి ఘటించాను ఆ త్యాగమూర్తికి, పవిత్ర గంగానదిలో నిలబడి.

''ఇప్పుడు, స్వర్గస్థులైన మీ నాన్నగారి కోసం మీరేదైనా త్యాగం చెయ్యాలనుకుంటే, ఆ వస్తువుని తలచుకుని 'నాన్నగారూ, మీపట్ల గౌరవభావంతో నాకిష్టమైన ఈ వస్తువుని ఈ క్షణం నుండి వర్జిస్తున్నాను' అని మనసులో అనుకుని దోసిలితో నీళ్లు వదిలేయండి'' అన్నాడు పండితుడు.

అంతవరకూ అనుకోకపోవడం వలన నేను ఆలోచనలో పడ్డాను నాకు ఇష్టమైన వస్తువులను తలచుకుంటూ.

''సర్వసాధారణంగా భుజించే వస్తువులనే ఇక్కడ వదులుకుంటారు. షుగరు వ్యాధితో బాధపడేవారు తీపి పదార్థాలను విడిచిపెట్టేస్తూంటారు. కాని అది సరియైన పద్ధతికాదు. వారి ఆరోగ్యం కాపాడుకోడానికి విడిచి పెట్టినట్టౌతుంది కాని చనిపోయినవారి గౌరవార్థం త్యాగం చేసినట్టనిపించుకోదు. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి. నిర్బంధమేమీ లేదు. అలా విడిచిపెట్టకపోవడం వలన తండ్రిగారి ఆత్మకు శాంతి చేకూరదని మాత్రం భావించకండి'' నిష్కర్షగా అన్నాడు పండితుడు.

అతడలా అంటూండగానే నేను ఏమిటి విడిచిపెట్టాలో నిశ్చయించేసుకున్నాను. కళ్లు మూసుకుని నిర్మలమైన మనసుతో నాన్నగారిని తలచుకుని దోసిలితో నీళ్లు వదిలేసాను.

ఆ రాత్రికే తిరుగు ప్రయాణం. రాత్రి ఏడుగంటలకి రూం ఖాళీ చేసెయ్యాలి. ఇంకా ఐదుగంటలు వ్యవధి ఉంది. రూం చేరుకున్నాక మళ్లీ ఒకసారి స్నానం చేసి అలసటగా ఉండడం వలన మంచం మీద కూలబడ్డాను, కాస్త నిద్రపోదామనుకుని. కొత్త ప్రదేశం అవ్వడం వలన అలసటగా ఉన్నా నిద్రరావడం లేదు. సీలింగ్ ఫ్యాన్ వైపు చూస్తూ కళ్ళు మూసుకున్నాను. కాలేజీలో చదివే రోజులు కళ్లలో మెదిలాయ్.

★ ★ ★

అవి విజయనగరం కాలేజీలో ఇంటర్ చదివే రోజులు. అప్పుడు కాలేజీకి హాస్టల్ సౌకర్యం లేదు. నలుగురు విద్యార్థులం కలిసి 'టూ టౌన్' పోలీసు స్టేషన్ దగ్గర ఒక గది అద్దెకు తీసుకుని ఉండేవాళ్లం.

# జిహ్వాచాపల్యం

నెలకు పన్నెండు రూపాయలద్దె! గదికి కరెంట్ లేదు. హరికేన్ లాంతర్లు పెట్టుకుని చదువుకునే వాళ్లం రాత్రిళ్లు. కాలేజీకి నడిచే వెళ్లేవాళ్లం గంట స్తంభం పక్కనుండి. ఒకే ఒక హోటలుండేది గంటస్తంభానికీ 'మూడు లాంతర్ల' జంక్షన్‌కీ మధ్యన. కాని ఇళ్లనుండి వచ్చే డబ్బంతంత మాత్రమే కనుక ఆ హోటల్‌కి పోయి ఎరగం ఎప్పుడూ.

భోజనాలు 'మూడు లాంతర్ల' దగ్గర సందులో బోర్డుస్కూలు ఎదర ఒక పూటకూళ్లమ్మ ఇంటిలో. ఆవిడ పేరు హనుమాయమ్మ గారు. ఆవిడ ఒక్కరే ఉండేవారు ఇంటిలో. పీటలు వేసి శుచిగా అరిటాకుల్లో వడ్డించేవారు. ఆప్యాయంగా అన్ని వంటకాలూ కొసరి కొసరి వడ్డించేవారు. కొత్తలో 'హనుమాయమ్మగారూ' అని పిలిచేవాళ్లం. కాని ఆవిడ చూపే అభిమానానికి కరిగిపోయి 'పిన్నిగారూ' అని పిలవడం మొదలెట్టాం తర్వాత తర్వాత. ఉదయం పదిగంటలకీ, రాత్రి ఎనిమిది గంటలకీ- రోజుకి రెండుపూటలు భోజనం. పూట భోజనం చేసేవాళ్లు అర్ధరూపాయ చెల్లించేవారు. మావి నెల భోజనాలు కాబట్టి నెలకి పాతిక రూపాయలు తీసుకునేవారు మానుండి. అంటే ఐదురూపాయలు రాయితీ ఇచ్చేవారన్నమాట మాకు నెలకు.

భోజనంలో అన్నంతో పప్పూ, ఒక కూర, పచ్చడి, ఉదయం భోజనమైతే, పులుసూ, రాత్రి రసం, అప్పడం, పెరుగూ- అప్పుడప్పుడు ఆవకాయా వేసేవారు. శనివారాలు మాత్రం రాత్రిళ్లు భోజనానికి బదులు ఫలహారం చేసేవాళ్లం. దిబ్బరొట్టె, వాసిని పోలి, అటుకులట్లు, కొయ్యిరొట్టె- ఇలా ఒక్కో శనివారం ఒక్కో ఫలహారం చేసేవారావిడ. అన్నీ చాలా రుచికరంగా ఉండేవి. అమ్మ చేసే వంటకాలకన్నా బాగుండేవి. అయితే అన్నింటిలోకీ 'కొయ్యిరొట్టె'దే అగ్రస్థానం! రెండువారాల కొకసారైనా చేయించుకుని తినేవాళ్లం. రెండోవారం ఏ కారణం వలనో కొయ్యిరొట్టె చెయ్యకపోతే- ''పిన్నిగారూ, ఏమీ అనుకోకపోతే- రేపు ఆదివారం కదా- మధ్యాహ్నం వస్తాం. కొయ్యిరొట్టె కాల్చి పెడుదురూ'' అనేవాళ్లం ముక్తకంఠంతో.


''దానికేముంది నాయనా, రండి, చేసి పెడతాను'' అనేవారావిడ అభిమానంగా. మేం వెళ్లేసరికి రొట్టె కాల్చి ఉంచేవారు సన్నటి సెగమీద. మా ఎదురుగానే ఇనప బాణలిలోంచి కంచంలో బోర్లించేవారు. మధ్యలో ముదురు ఎరుపూ, చుట్టూ లేత ఎరుపు రంగుతో ఉండే ఆ అర్ధగోళాకార వంటకాన్ని చూసీ చూడగానే నోరూరేది. అట్లకాడతో ముక్కలు చేసి నంజుకోడానికి ఆవకాయ పిండి వేసి కంచాల్లో పెట్టేవారు. అలా ఆవిడ చేసిన కొయ్యిరొట్టెను ఆస్వాదిస్తూ పొందిన తృప్తి ఇంతవరకూ ఏ వంటకంలోనూ పొందలేదు నేను.

చదువు పూర్తి అయిపోయాక విజయనగరం వదిలి వచ్చేస్తూ సిగ్గు విడిచి ఆవిణ్ణి అడిగేసాను- కొయ్యిరొట్టె చేసే పద్ధతి! మరచిపోతానేమోనని రాసి ఉంచుకున్నాను కూడా.

అమ్మతో చెప్పి చేయించుకున్నాను. పెళ్లయిన తర్వాత మా ఆవిడతో చెప్పి చేయించుకున్నాను. చాలాసార్లు చేసిందావిడ. అయినా ఆ రుచి రాలేదు. ఆ తృప్తి కలగలేదు.

ఉద్యోగంలో చేరాక ఆఫీసు పనిమీద ఒకసారి విశాఖపట్నం వెళ్లవలసి వచ్చింది. అప్పటికి విజయనగరం విడిచిపెట్టి ఆరు సంవత్సరాలైంది. మధ్యలో వీలు కల్పించుకుని పిన్నిగారిని చూడాలని, వీలైతే కొయ్యిరొట్టె చేయించుకుని తినాలనే తలంపుతో విజయనగరం వెళ్లాను విశాఖనుండి. హనుమాయమ్మగారు విజయనగరం వదలి కూతురు దగ్గరికి వెళ్లిపోయారట. పక్కింటివాళ్లు చెప్పేరు. నిరాశతో విశాఖ వచ్చేసాను వెంటనే. మళ్ళీ హనుమాయమ్మగారిని చూడలేదు. 'రాయగా రాయగా కరణం!' అన్నట్టు చెయ్యగా చెయ్యగా మా ఆవిడ చేసే కొయ్యిరొట్టెలో రుచి పెరిగింది. అయితే హనుమాయమ్మగారి కొయ్యిరొట్టె ముందు తీసికట్టే!

హోటలు కుర్రాడు తలుపు తట్టడంతో వాస్తవంలోకొచ్చాను.



★ ★ ★

సాయంత్రం బండికి వస్తున్నానని ముందుగా టెలిగ్రాం ఇవ్వడం వలన డ్రైవరు కారు తీసుకుని వచ్చాడు స్టేషనుకి. ఇల్లు చేరేసరికీ సాయంత్రం ఏడు దాటింది.

అమ్మని పెద్దక్క తీసుకుని వెళ్లిందట! నాన్న గారు లేని ఇల్లు బోసిపోయినట్టనిపించింది.

స్నానం చేసి వచ్చి, ''ఆకలిగా ఉంది. వంట అయిపోయిందేమో వడ్డించేద్దూ'' అన్నాను మా ఆవిడతో.

''కాశీ వెళ్లి వచ్చారు. రాత్రి భోజనం చెయ్యకూడదు. ఎంతకాలం నుండో మీరు తినాలనుకుంటున్న ఫలహారం చేయించి ఉంచాను'' అంది ఆవిడ ఉత్సాహంగా.

పీట వాల్చుకుని కూర్చుంటూ అయోమయంగా చూసాను ఆవిడ వైపు.

''మీ విజయనగరం పిన్నిగారు అనుకోకుండా తారసిల్లారు. మన పక్కింటి విమలమ్మగారికి ఆవిడ మేనత్త అవుతారట. మొన్న విమలమ్మగారితో కలిసి మనింటికి వచ్చారు. మీ ఫోటో చూసి గుర్తుపట్టారు. ఆవిణ్ణి చూడగానే చాలా సంతోషమనిపించింది నాకు. ఆవిడ చేసిపెట్టే కొయ్యిరొట్టె గూర్చి మీరు చెప్తున్నప్పుడల్లా అనిపించేది- జీవితంలో ఆవిడొక్కసారి కనిపిస్తే బాగుణ్ణని. మీరు, నేను చేసిపెట్టే కొయ్యిరొట్టె తింటూ 'బాగుంది' అనేవారు. కాని నాకు తెలుసు. ఆమాట నేను నొచ్చుకోకుండా ఉండాలని అనేవారు. మీరు కోరిన విధంగా చేసిపెట్టలేకపోతున్నానని ఎప్పుడూ బాధపడేదాన్ని. అందుకే ఈ సమయంలో చెప్పవలసిన విషయం కాదని తెలిసి కూడా మొన్న ఆవిణ్ణి చూడగానే అంతా చెప్పాను. నేను చెప్పినదంతా విని ఆవిడ ఎంతగానో మురిసిపోయారు. సాయంత్రం వచ్చి చేసి వెళ్ళారు దీనిని, రాత్రి మీరు వచ్చాక వడ్డించమని చెప్పి. రేపు ఉదయం వస్తారుట మిమ్మల్ని చూడడానికి..'' ఎంతో ఉత్సాహంగా చెప్పి వంటగదిలోకెళ్లింది ఆవిడ.

అవాక్కయ్యాను నేను. కలలో జరుగుతున్న సంఘటనలా తోచింది.

కంచంలో వేసి తెచ్చిన ఆ ఎర్రని అర్ధగోళాన్ని సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ ఉండిపోయాను. ఎన్నో సంవత్సరాల క్రితం పోగొట్టుకున్న నిధి దొరికినట్టయింది. సాక్షాత్తూ విష్ణుమూర్తి మా ఆవిడ రూపంలో వచ్చి నా ఎదుట అమృతకలశాన్ని పెట్టినట్టనిపించింది ఆ క్షణంలో.

కాని వెంటనే ఎక్కడాలేని నిస్పత్తువా నాలో ఆవహించింది!

''కొయ్యిరొట్టెని కాశీలో వదిలి వచ్చేసాను'' నీరసంగా అంటున్న నావైపు జాలిగా చూస్తూ ఉండిపోయింది మా ఆవిడ!

యం. యస్. వి. గంగరాజు